అంతయు నైనది. నిమ్మకు నీరెత్తినట్లు తండ్రికొడుకు లిద్దఱు మొగములు వ్రేలవైచుకొని, కుటీరమున కేతెంచిరి. తమ్ముఖద్వారము బావురుమని వారి నాహ్వానించుచున్న ట్లున్నది. ఆకుటీర మిప్పటి కింకను నుత్ఫుల్ల ప్రసూన పరిమళ పరిష్వంగమునఁ జిక్కి, మైమఱచెను. నిశ్శబ్దము జగమును మ్రింగిన భంగిఁ దోఁచిన దావిషాదాక్రాంత మానసులకు. తలుపు దెఱచిరి. లోన నడుగిడిరి. సర్వము శూన్యమైనట్లు వారికి గోచరించినది.

నౌకరు సర్వమును చక్కఁబఱచెను. వస్తువు లేవియు చెదరలేదు. మిగుల పరిశుభ్రముగా నున్నవి. పెంపుడు పిల్లి దాలిగుంటలోఁ జేరినది. చలికాలపు మునిసూర్యుఁడు తనయనురాగకరములతో వాతాయనములగుండ దుఃఖితు లిద్దఱ నోదార్చుచున్నాఁడు.

తండ్రి పడక కుర్చీలోఁ జేరగిలఁబడి, యొక్క నిట్టూర్పు విడిచెను. "పాపము! మీనాయమ్మ"—అంతే యిఁక నాతఁడు మాటాడలేదు. రెండుమూడు బాష్పకణములు గన్నులనుండి జారినవి. నిష్కల్మష మైన—ప్రేమ పూరితమైన—జాలి కలిగించు నావృద్ధముఖమండలమున నరుణకాంతి యించుక యలముకొనియెను. వృద్ధజనకుఁ డొక్కింత వడికిఁ గన్నుంగవ విప్పి చూచెను. కొమరుఁ డూరక వాపోవుచుండెను. అతని కిరువదియైదేండ్ల వయస్సు. జనకుఁడు ప్రేమ యుట్టిపడునట్లు నిజకరకమలములతోఁ దనయుని శిరమెల్లఁ దడవి, యాఘ్రాణించెను.

" నిజకరకమలములతోఁ దనయుని శిరమెల్ల దడవి, యాఘ్రాణించెను. "

ఇంతలో ముసలిసేవకుఁడు మునివ్రేళ్లపై నడచుచు వచ్చి, నిశ్శబ్దముగాఁ దలుపుఁ దెఱచెను. "అయ్యా! భుజించుటకు వేళ యైనది. ఎంత విచారించినను బ్రయోజనము లేదుకదా!—దయచేసి లేచిరండు." అని యావిశ్వాసము గల సేవకుఁడు పిలిచినవెంటనే వారిద్దఱును దల లెత్తిచూచిరి.

బ్రదికినవాళ్లు ప్రతిజీవియు పొట్టపోషించుకొనవలసిన దేకదా!—మరల నవీనజీవన స్రవంతి వారి వైపునకుఁ బ్రవహించుచున్నది. వారి కాఁకలి మిక్కుటమైనది. ఆ యాఁకలి గతసంతోషకాలమునం దుండిన యాఁకలి కాదు. కడుపు మండుచున్న జంతువు కుండు నాఁకలి. అయినప్పటికి పట్టినసమయమున భుజించు తలఁపు మిక్కిలి లజ్జాకరమని వారికిఁ దోఁచినది. ఒకరిమొగము నొకరు చూచుకొనిరి. ఒక్కరును లేచుటకు సాహసింపలేదు.

ఎట్టకేలకు తండ్రి గద్గదకంఠుఁడై, "అవును, మురాద్—నీవన్నది నిజము. బ్రదికినన్నాళ్లు ఉదరపోషణ తప్పదు కదా!" అని కొమరునివైపు తిరిగి: "నాయనా! లెమ్ము—పొట్ట నిండించుకొందము." అందులకు కుమారుఁడు, "అటులనే, బాబా!" యని నిట్టూర్పుతో బదులుచెప్పి బయటి కేఁగెను. ఇంతలో నొకదాసి యతనికడ కరుదెంచి, "తారకనాథమహాశయా! నేను తమకొఱకొక వస్తువును దాఁచియుంచితిని. ఒకవారము దినములక్రిందట జీవనైరాశ్యమైన దేవరజనని నాచేతి కీ లేఖ నిచ్చి, యామె ప్రాణవాయువు లనంత వాయువున లీనమైన వెనుక దీనిం దమకం దిమ్మని యానతిచ్చెను. ఆలేఖయే యిది" అని రహస్యముగా వక్కాణించెను.

చకితుఁడైన తారకనాథ్ పరిచారికవైపు తేఱిపాఱఁ జూచెను. ఆమె పిఱికితనమువలన వణఁకుచున్న హస్తమును జాఁపి, లేఖ నందించుచుండెను. ఒకయజ్ఞాత దుర్భర బాధను, ఒకరహస్య వృత్తాంతమునుఁ దెలియఁ జేయుటకీ కమ్మ సృజింపఁబడినదని యాతఁ డనుకొనెను. చాలప్రయత్నము మీఁదఁగాని యాతఁడు మెల్లగాఁ మాటలాడఁ జాలకపోయెను.

"అయిననిటు తెమ్ము"

"అయిన నిటు తెమ్ము" అని యాలేఖను గ్రహించి తారకనాథుఁడు తన మాతృమందిరమును జొచ్చెను. ఏమున్న దక్కడ?—సర్వము శూన్యము—సర్వ మంధీభూతము—నిశ్శబ్దతానిరంకుశత్వము—గర్భనిర్భేదక ప్రదర్శనము. విచారమనస్కుఁడై యాతఁడు మాతృసందేశమును దెలిసికొన లేఖవంకఁ జూచెను. పైవిలాసమందతని పేరే—ఆ ప్రజ్వలితానురాగాంకురములే!—ఆదివ్య లేఖని నేత్రగోళములలో తాండవమాడుచున్న ట్లున్నది. ఆతఁ డాలేఖ నటునిటు ద్రిప్పెను. ఆతని రక్తనాళములు జలబరించినవి. తా నదివఱకెల్లప్పుడును జూచి యానందించు ముద్దులొల్కు లేఖని యాకాగితమున మిక్కిలి వణఁకిపోయినది.

ప్రక్కగదిలో భోజనము చేయుటకు పరికరము లమర్చుశబ్దము కర్ణగోచర మగుచుండెను. తారకనాథ్ మెల్లగా జాబు విప్పి చదువసాగెను:—

"నాముద్దుబిడ్డా!—

నాజీవయాత్రా సమర్పణ సమయ మేతెంచినదని నాకుఁదోఁచుచున్నది. దాన మనయిర్వర యెడఁబాటు సంఘటిల్లును. కావున నిదే నా కడపటి వీడ్కోలు. అభినందనములు.

నా కిప్పటికి దేహదౌర్బల్యము, మనోవ్యథ నశించిన వనియే చెప్పవచ్చును. నీవు పెరిఁగి పెద్దవాఁడ వైతివి. వినయ విద్యాసంపన్నత నొందితివి. గ్రహింప శక్తి కల్గినది. నేను నీ విషయమున ననువర్తింప వలసిన నాదైవనిర్దిష్ట ధర్మమునుండి యొక్కయడుగైన వెనుకంజ వేయలేదు. కాని యొక్క టున్నది. దాని నిదివఱలో వెల్లడించుటకు నాకు ధైర్యము చాలినది కాదు. ఇప్పుడు నాస్థితినిఁ బట్టి నీకడ దాని వెల్లడింపను తప్పక వచ్చినది.

నీవు ఎవతెను హృదయ పూర్వకముగఁ బ్రేమించితివో,—అన్నిటికన్న నెక్కుడుగ నెవ్వరిని గౌరవించితివో,—పసినిసుంగువై, యెవ్వరి యొడిలో బాల్యము

చేష్ట లాలికించి, ముద్దులు గురిపించితివో,—యౌవనదశలో నెవ్వతెకడ నీ కష్టనిష్ఠురకావ్యము విప్పి పోసితివో,—ఆ నీమాతృదేవి పతితురాలు — ఒక మహాపరాధిని.

నీవు సర్వకాలసర్వావస్థల యం దెవ్వని "బాబా!" యని నోరారఁ బిల్చుచుంటివో, యాపవిత్రజీవి నిక్కముగ నీతండ్రి గాఁడు. నాజీవితకాలమున నేను పవిత్ర ప్రణయ సుధాధారలచే నభిషేక మొనర్చిన దీమహాజగత్తున నొక్కప్రాణిని మాత్రమే. ఆతఁడే నీకన్నతండ్రి. అదే నా నేరము. అదే నన్నుఁ బాతాళమునకుఁ గ్రుంగఁ దీయుచున్నది. దానినే వెల్లడింప నశక్తురాల నైతిని. నీతండ్రి — నీ నిజమైన — నినుఁ గన్నతండ్రి, జీవించియే యున్నాఁడు. ఆతఁడు నిన్ను నీ శైశవదశయందు హృదయమున నొత్తి, ముద్దు లాడెడివాఁడు. ఇప్పటికిని నిన్నాతఁడు కడుజాగరూకతతో రహస్యముగాఁ గనిపెట్టుచున్నాఁడు. దాని నే నెఱుంగుదును. నీవు పెద్దవాఁడ వైతివి. నీ భావిజీవితమును నీవే నిర్ణయించుకొనఁ గలవు. కోరిన యెడల నీవు నీజీవితమును నొక్కమాఱుగా పరివర్తించుకొనఁగలవు. నాకు లేని ధైర్యసాహసములే నీ కున్న యెడల, రేపే నీ వొక గొప్ప జమీందారుఁడవు కాఁగలవు. పుత్రా!—నే నొక మహాభీరుకార్యము నాచరించుచున్నాను. భీరుజీవితమునే గడపితిని. కాని భీరురాలనై చనిపోవుటకు మాత్రము నే నొప్పుకొనను. ఒక నూరుతడవలు నిన్నుఁ గొని యిచ్చోటునుండి పాఱిపోవుటకుఁ బ్రయత్నించితిని. అయిన నాకు మనోబలము, ధైర్యసాహసములు శూన్యములై పోయినవి. నీ ప్రస్తుతపు తండ్రి యేమాత్ర మనుమానపడినను నాపలాయనమువ కూఁతగా నుండెడిది. పాప మాతఁడు కోపముతో నొక్కపలుకైన నెన్నఁ డాడియుండలేదు. అతఁ డెల్లప్పుడు చాల మంచిగాను, దయాపూర్ణస్వాంతముతోను సంచరించుచూ వచ్చెను. అయినప్పటికిని, మహాపరాధిని—నేను—నాకు—ప్రేమ లేదు—బాబూ!—నిజముగా లేదు సుమా!!—"

చదువు టింకను కాలేదు. నిశ్చేష్టితుఁడై నిలువఁబడిపోయెను. ఆహా! స్త్రీ లెంతకైన సాహసులే కదా!—ఆయువకుని జనని పరపురుషునిఁ బ్రేమించుటయు, నాతనివలనఁ గొమరునిఁ గనుటయు, నా నిగూఢరహస్యమును దాచియుంచుటయు స్వామిద్రోహ మొనర్చియు సిగ్గులేక,—నదరు బెదరులు లేక,—విహసితాధరపల్లవముల వణఁకు తొణఁకు లైన లేక, ఘోరాపరాధరహస్యమునుఁ దన మనఃపాతాళ గహ్వరంబునఁ బాఁతి బంధించి నంగనాచివలె నటించుటయు, నీచర్య లన్నియు "స్త్రీబుద్ధిః ప్రళయంకరీ" యను నార్యోక్తి నుపపాదించుచున్నవి. తారకనాథ్ సత్యవర్తనయందు భీరువు లైన పరవనితలఁజూచి యసహ్యించుకొను చుండెడివాఁడు. ఇప్పుడో? తనదాఁకా వచ్చిన దాదోషవ్యాపారము. అంతటితో నాతని యహంభావము, ఆనందము అన్నియు

"హా! మాయా!"

నశించినవి. అపరిమితహృదయ భారముతో సాభిప్రాయంబుగా, "హా!—మాయా!!—" అని బాధతోఁ బలికెను. అదియుంగాక నాతఁడు పెంపుడుతండ్రికడ కడుంగడు గారాబంబుగాఁ బెరింగెను. అట్టి యమాయికుఁడగు పాప

పుణ్యము లెఱుఁగని మహోదారుఁడైన యా మహాత్ముని వృద్ధుని కట్టి యవమానము గలిగించుట, ద్రోహ మొనర్చుట, మిక్కిలి పాపావహము, భీరుత్వము, నిర్లజ్జాత్వము.

ఆతని యావనోదంతమంతయు నొక్కటొకటి స్మృతి పథమునకు వచ్చెను. వెనుకటి బాల్యస్మృతి యా యువకుని మరల నొకపరి బాలునిఁగా మార్చినది. అప్పటి దినములలో నాతఁడు తండ్రికరమును గట్టిగఁ బట్టి, పాటల వెంబడి చాలనవ్వు సంతోషముతో నడచుచుండెడివాఁడు. ఆదశ గతించినది. కొంత కాల మైనది. భయంకర వ్యాధి యొకటి దాఁకి, యాతని చావుబ్రదుకుల నడుమ సందిగ్ధావస్థలోఁ బడవైచినది. ఆ దినములలో తండ్రి యాతనిప్రక్క నహోరాత్రంబులు గాఁపుదలగాఁ గూరుచుండి, యప్పుడప్పుడు తన యవిరళోద్గత బాష్పవారిధారలనందునుండి చిరునవ్వు వెలువరింప యత్నించుచుండెడివాఁడు. అంతటితోఁ గాలచక్రము మార్పుఁజెందినది. వ్యాపారసంబంధములైన తికమకలు, మనస్తాపములు సంభవించినవి. అప్పుడు తారకనాథుఁడు రోగశయ్యపై నిద్రించువాని వగిది కనులు మూసికొని పరుండి విన్న సంభాషణములు గొన్ని యాతని భావనాలోకమునఁ బ్రవేశించినవి. తల్లి యొకటి రెండుమాటల మాత్ర మాడినది. ప్రియజనకునివాక్యము లాతని మనఃకందరాంతరమునం బ్రతిధ్వను లొసఁగుచున్నవి:

"ప్రియతమా! నే నింతటినుండి వ్యాపారవ్యవహారములఁ జక్కఁబఱచుకొని సాధ్యమైనంతవఱకు కన్ని ఖర్చులఁ దగ్గించుకొందును. ఇక నే నెన్నండును పొగ పీల్చను. భోజన కాఫీశాలల కరుగుట మానివైచెదను. ప్రస్తుతము నావద్దఁ గల వస్త్రములు కొంతకాలము వచ్చును. కాని బాబుకుమాత్ర మేకొఱంతయుఁ గలుగఁగూడదు. అందందు సేకరించి దాఁచియుంచిన ధనముతో బాబు అడిగినవెల్ల శక్తికొలంది తెచ్చియిచ్చుటకుఁ బ్రయత్నింపవలెను. పసిబిడ్డలు కష్టపడుకాలము ముందుండును. ఇప్పుడే మన మేల యాతని నసంతృప్తునిఁగాఁ జేయవలెను?"—

అని పల్కెడియట్టి నిరుపమ నిష్కల్మష ప్రేమమయ మహోదారుఁడైన వృద్ధజనకునా యాతఁడు మోసగించినది?

ప్రేగులు త్రెంచుకొని దుఃఖ మూడిపడుచుండెను. చాల ఏడ్చెను. ఆవాక్య మాతని దృక్పథమునకు వచ్చెను: "నీ భావిజీవితమును నీవే నిర్ణయించుకొనఁ గలవు"—అది నిజమే. ఇఁక నాలస్యము చేయుట కాతని కధికారము లేదు. మాతృ సందేశముఁ బరిపాలింపవలెను. అతులైశ్వర్యలోభాకృష్టుఁడై యాతఁడ ట్లాచరించుట లేదు. మాతృదేవికి లేని మనోధైర్య మాతని కుండి తీరవలెను జనకునకేమియుఁ జెప్పకయే తారకనాథుఁ డచ్చోటు వాసి పోవలెను. చాల దూరము—ఇంకను దూరము: కనుపడకుండ పోవలెను. తిరిగి రానే కూడదు. అప్పుడు తనకు సంభవించిన యవమాన మంతయుఁ దనతోనే పోవును. అంతియ గాని, యా వృద్ధజనకుఁడైన మహాపురుషుని ప్రక్క భోజనమునకు నుపవిష్టుఁ డగుటయు, నా దయాపూరితుని ప్రేమాలాపములు—గతించిన జననినింగూర్చి యాతని విచారభాషణముల వినుచుండుటయు దోషపూరితుఁడైన తారకున కెట్లు సంభవించును? సంభవించినను మనస్కరించు టెట్లు?—

కర్తవ్యమును నిర్ణయించుకొనెను. మరల మాతనేర మాతని మనోవీథి నల్లకల్లోల మొనర్చినది.

"హా! మాయీ! మాయీ!!" అతఁడు విలపించుచుండెను. ఓదార్చువా రెవరు? "తల్లీ! యీ ఘోరవిశ్వాసఘాతుకత్వ మాదయామయుని ధర్మమూర్తికడ నెట్లాచరించితి, నమ్మా? కఠోరహృదయా!—"

ఇఁక నో ప్రశాంత సంతోష జీవన తరంగిణీ! సెలవు. ప్రాణికోటులఁ గుక్షి నిడుకొని సంరక్షించు నో గృహ దేవతా! సెలవు. పరిసరోద్యానవన ప్రసూన సురభి శోభావనమా! సెలవు. ఇఁకమీఁద నాతఁ డచ్చోట కృతకజీవన మొనర్చుటకు హక్కు లేదు.

విచారమున మున్గి యాతఁడట్లే కొంతవడి నిశ్శబ్దముగా నుపవిష్టుఁడై యుండెను. భోజనశాలనుండి కంఠధ్వనులు వినవచ్చుచుండెను. చెవి యొగ్గెను:



"భోజనశాలనుండి కంఠధ్వనులు వినవచ్చుచుండెను. చెవి యొగ్గెను."

"పాపము! నాచిన్నబాబు ఎంతగా వాపోవుచున్నాఁడో!—అతఁ డిప్పుడు తల్లిగదిలోఁ బరుండి యేడ్చుచుండెను. దైవమా! ఏమిదుర్దశ!! —నేను కాటికిఁ గాళ్లు చాఁపుకొనియున్న మూఁడుకాళ్ల ముదుసలిని. కాని యదృష్టమువలన నా కీబాలుఁడు గలిగెను. అతఁడు మంచివాఁడు. నన్ను వదలి యుండఁజాలఁడు. నేనును నాతని నెడఁబాసిన మఱుదినమందే మృతినొందుదును."

మనయువకుఁడు దానిని విని మిక్కిలి చకితుఁడయ్యెను. రక్తము వచ్చునట్లు పెదవి గొఱుకుకొనెను. జనకుఁ డింకను మాటాడుచునే యుండెను. కుమారుఁడు దానిం గొంచెముగొంచెముగా విన్నకొలంది నాతనిమనసు మారుచున్నది. ఆలోచనలు వేఱొకమార్గముఁ బట్టినవి. ఇప్పు డాతనికి విధ్యుక్తధర్మము సులభమైనది. ఇంకను, "అతఁడు నన్ను వదలియుండఁజాలఁడు. నేనును నాతని నెడఁబాసిన మఱుదినమందే మృతి నొందుదును"—అను వాక్యము లాతని వీనులం బ్రతిధ్వనులతో మ్రోఁగిపోవుచున్నవి.

పాప మావృద్ధజనకు నొంటరి జీవనమున కొప్పగించి పాఱిపోవుట కాయువకుని కాళ్లాడునా? పుట్టినదాది తండ్రి తన కభిషేక మొనరించుచున్న నిర్మలప్రేమనిష్యంద వృష్టి కిదియా ప్రత్యుపకారము? పుత్రుని కడు జాగరూకతతోఁ బెంచుటకుఁ బడినమహాకష్టముల కన్నింటి కిదియా ప్రతిఫలము? కాని తారకనాథ్ అవృద్ధునకుమారుఁడు కాఁడే? అన లాతఁ డచ్చట నిలుచుండుటకే యాతనికి భరింపరానిబాధ యేదో కలుగుచున్నది. అయినను నతని భావిజీవితము నాతఁడే నిర్ణయించుకొనవలెను. ఇప్పుడే, ఏమాత్ర మాలసింపకయే నిర్ణయించుకొనవలయును.

ఆతఁడింకను జాబునుఁ జేతియందే యుంచుకొనెను. పునఃపఠనమునకుఁ గడంగెను.

"నీప్రస్తుతపు తండ్రి యేమాత్ర మనుమానపడినను నాపలాయనమున కూఁతగా నుండెడిది. పాప! మాతఁడు ....నిజముగా లేదుసుమా!"

మరల జనకుని వచనములు చెవి సోఁకినవి; ముసలి సేవకునితో సంభాషించుచుండెను:

"అవును, తాతా! ఇరువదియేఁడు లామెతో సౌఖ్యముగా నుంటిని. అం దొక్కపరియైన మా సంతోషజీవన ప్రభాకరునిఁ గష్టజీమూతపటలి యడ్డగట్టలేదు. కేవల మొక్కమొయిలేని తేటి చూడఁజాలక పోయినది."

తిరుగ నాయువకుఁడు తల్లేఖావశేషమును బూరింప మొదలిడెను:

"—నే నిప్పుడు నీ నిజజనకుని యభిధేయమునుఁ జెప్పక తప్పదు. అది—"

చేతులు వణఁకెను. ఒక్కసారి మాత్ర మాలేఖలోని తండ్రి పేరునుఁ జూచెను. అంతియే,— మరల నెన్నండును దానిం జూడలేదు. ఆనామ మాతని హృదయ కేదారమున నాటుకొనిపోయినది. ఎన్నఁటికిని మఱవఁజాలఁడు.

అప్పుడే ఒక మృదువైన — కరుణారసప్లుత మైన మధుర కంఠస్వరము వినవచ్చెను:

"రమ్ము, బాబా! రాత్రి యైనది. భుజించు వేళ మించి పోయినది. ఊరక వాపోయినఁ బ్రయోజనము లేదోయీ, పుత్రా!—"

మహత్తరమైన యొక చలితెమ్మెరతీవ తారకనాథుని రక్తనాళములలో మెఱుపు మెఱసినట్లయ్యెను. ఆపాదమస్తకము జలదరించినది. నిమిషమువఱకుఁ గనులు గట్టిగా మూసి యుంచెను. పిదప నాతఁడు నిప్పుపుల్ల గీసి యాజాబు కంటించెను. అది సాంతముగాఁ గాలువఱ కళ్లే పట్టుకొని తదుపరి నేలపై విడిచెను. లేఖ యింక లేదు. మాఁడి మసి యైనది.

భోజనశాలతలుపుకడ కేఁగి దానిం దెఱచెను. ఒక్కింతకాలము జనకుని దయాపూర్ణ వదనముపై దృష్టి నిలిపెను. పాప! మావృద్ధుని ముఖమండలము దుఃఖముచే నరుణిమఁ దాల్చెను. చేతులు తొట్రిలుచున్నవి. తారకనాథుఁడు ముసలి శాంతమూర్తి—తనతండ్రికడ కేఁగి, యాతని గాఢముగాఁ గౌఁగిలించి,—

"బాబా—నా బాబా!!—నా ప్రియతమమైన ముసలిబాబా!!!—"అనియెను;—అంతే.

చిత్రకారుడు : శ్రీ తలిశెట్టి రామారావుగారు, బి. ఏ., బి. యల్.

శతకమంజరి (భక్తిసంపుటము)

ఆంధ్రగ్రంథమాలలో మొదటి పుస్తకము

ప్రకాశకులు : కాశీనాథుని నాగేశ్వరరావు

ఈపుస్తకంలో వృషాధిపశతకము, సర్వేశ్వరశతకము, దేవకీనందనశతకము, ఒంటిమిట్ట రఘువీరశతకము, నారాయణశతకము, కాళహస్తీశ్వరశతకము, దాశరథిశతకము, రంగశాయి శతకము, రామతారకశతకము, రామచంద్రశతకము అనే పదిశతకాలు ఉన్నవి. ఒక్కొకశతకానికి దానిని విమర్శిస్తూ ప్రకాశకులు వ్రాసిన మంచిపీఠిక ఉంది. చాలా వ్రాతప్రతులతో సరిచూచి వాటిల్లోనుంచి తీసిన పాఠాంతరాలున్ను ఎక్కింపబడినవి.

డెమ్మీసైజు ౨౫౦ పుటలు, మంచికాగితాలు, మేలు బైండు. వెల రు. ౧-౮-౦.

ఈ శతకాలు ఒక్కొక్కటీ ప్రత్యేకం దొరకును. ఒక్కొకదాని వెల రు. ౦-3-౦.

అంచెకూలి కొనువారిదే.

మేనేజరు : ఆంధ్రగ్రంథమాల,

6-7, తంబుశెట్టివీధి, జార్జిటవున్, చెన్నపురి.